క్లుప్తంగా

సింగిల్ విండో విధానంలో అనుమతులు

● ఎస్సై దామోదరరావు

చీపురుపల్లి: వినాయక ఉత్సవాలు నిర్వహించే వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని ఎస్సై ఎల్. దామోదరరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వినాయక మంటపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పోలీస్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మంటపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా కమిటీ సభ్యులదే బాధ్యతని స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల ప్రదర్శనలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు ప్రదర్శించకూడదని చెప్పారు. అలాగే నిమజ్జనాల సమయంలో డీజేలు, బాణసంచా కాల్చడం కూడా నిషేదమని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించాలి

దత్తిరాజేరు: వినాయక చవితి సందర్భంగా మంటపాలు ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పెదమానాపురం, ఎస్. భూర్జవలస ఎస్సైలు ఆర్. జయంతి.జి రాజేష్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంటపాల వద్ద వాహన రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలు ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గజపతినగరం: ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, రైతులకు అవసరం లేని ఎరువులు అంటగట్టినా చర్యలు తప్పవని ఏఓ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బి.రత్నకుమార్‌తో కలిసి సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నిల్వలు పరిశీలించారు. విక్రయించిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో ఉన్న ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు, డిప్యూటి తహసీల్దార్ సీహెచ్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

● ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్


మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: కర్మాగారాల్లో విధులు నిర్వహించే కార్మికులకు ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని మరుపల్లిలో గల ఓలం కంపెనీలో పనిచేస్తున్న కార్మికులతో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. నేటి తరం తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో ప్రత్యేక దృష్టి కనబరచాలని సూచించారు. అలాగే యుక్త వయస్సుకు వచ్చిన పిల్లలతో స్నేహపూర్వక వాతావరణంతో మెలగాలన్నారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని.. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ, కొత్తపాలెం గ్రామాల్లో కొంతకాలంగా మేకలు, గొర్రెలు, విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడిన నలుగురిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీఏవీ రమణ, ఎస్సై మహేష్ తెలిపారు. కొండపేట, కొత్తపాలెం, వెదురువాడ, అనంతగిరి గ్రామాలకు చెందిన బి.పైడిరాజు, కె. చంద్రరావు, కె.రాంబాబు, బి.శివలను సోమవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఆటోతో పాటు రూ.12 వేల నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులోనే మరో వ్యక్తి..

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని గణేష్ కోవెల వీధిలో చోరీకి పాల్పడిన గ్రంధి హరి శంకర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ జీఏవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పూసర్ల మహేష్, పూసర్ల బాలాజీ, సాంబమూర్తిల పిండిమిల్లులో రూ.14,100 నగదు చోరీకి హరిశంకర్ పాల్పడ్డాడని, నిందితుడి నుంచి రూ.14వేలు రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓం మహా గణాధిపతయే నమః

● వాడవాడలా వెలియనున్న గణనాథులు
● పోటాపోటీగా మంటపాల ఏర్పాట్లు
● మార్కెట్‌కు చవితి సందడి


ఎస్.కోట మార్కెట్‌లో పత్రి విక్రయిస్తున్న మహిళలు

శృంగవరపుకోట: జై..జై..గణేషా..జయములివ్వు గణేషా..అభయమివ్వు బొజ్జ గణేషా... అని పట్టణం నుంచి గ్రామాల వరకు గణనాథుల సందడి కనిపిస్తోంది. ప్రమద గణాధిపతి గజాననుడి అనుగ్రహం పొందితే అన్నింటా శుభాలే కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. కుల, వర్గ, వర్ణాలకు అతీతంగా గ్రామాల్లో సమైక్యతకు నిదర్శనంగా నిలిచే గణపతి నవరాత్రులకు రంగం సిద్ధం కావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. గణనాథుల ఏర్పాటుకు వాడవాడలా పిల్లలు, పెద్దలు సన్నద్ధమవుతున్నారు. ఉత్సవాలు నిర్వహణకు ఇప్పటికే భారీస్థాయిలో వేదికలు సిద్ధమయ్యాయి. పెద్దవారికి దీటుగా పిల్లలు సైతం ఉత్సవాల నిర్వహణకు ముందుకొస్తున్నారు.

పోటాపోటీగా..

పట్టణాలు, గ్రామాల్లోనూ గణనాథుల ఏర్పాటుకు భారీ స్థాయిలో వేదికలు సిద్ధమయ్యాయి. పట్టణంలో సెట్‌లు వేసేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన ఇంటీరియర్, స్టేజ్ డెకరేటర్లను తీసుకురావడం విశేషం. పట్టణాల్లో ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువజన సంఘాలు, కార్మిక సంఘాలు ఈ ఏడాది కూడా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణం మొదలు గ్రామాల వరకూ ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే గణనాథుల రాకకోసం గ్రామాల్లో మైకులు రాగాలు తీస్తున్నాయి.


ఆకట్టుకుంటున్న డెకరేషన్ సామగ్రి


అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

పత్రి, పండ్లకు భలే గిరాకీ..

వినాయక చవితి నేపథ్యంలో పత్రికి, పూలు, పండ్లకు గిరాకీ ఏర్పడింది. గణపతికి ప్రీతిపాత్రమైన దూర్వాలు, వాకుడాకు, మారేడు, మాసుపత్రి, ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి, తులసి, మామిడి, గన్నేరు, విష్ణు పత్రం, దానిమ్మ, దేవదారు, మరువకం, వావిలాకు, జాజి ఆకు, ఏనుగు చెవిఆకు, జమ్మి పత్రం, రావిఆకు, మద్ది ఆకు, జిల్లేడు వంటి పత్రి సేకరణలో భక్తులు బిజీగా ఉన్నారు. మార్కెట్‌లో పత్రిని విక్రయిస్తుండడంతో చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. అలాగే పూలు, పండ్లు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, డెకరేషన్ సామగ్రి విక్రయాలతో మార్కెట్‌కు చవితి సందడి వచ్చింది.

పశువులకు పోషకాహారం

● పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు చలపతిరావు


పశువుకు చికిత్స అందిస్తున్న వైద్యాధికారి గాయత్రి

వేపాడ: పాడి పశువులకు ఇచ్చే ఆహారంలో ఎక్కువగా పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు (ఎస్.కోట) డాక్టర్ చలపతిరావు అన్నారు. వావిలపాడులో డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యల వల్ల దూడల జననం తగ్గిపోతుందన్నారు. ఖనిజ లవణ మిశ్రమాన్ని తగినంత ఇచ్చినప్పుడు చిన్న చిన్న సమస్యలు తగ్గుతాయన్నారు. అలాగే ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గంట్యాడ: నరవ గ్రామంలోని జాతీయ రహదారిని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎస్. తిరుపతిరావు అనే వ్యక్తి ఆక్రమించి షాపులు నిర్మించారని అదే గ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు గ్రీవెన్స్‌సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. సుమారు 30 లక్షల రూపాయల విలువైన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువుల నిల్వల పరిశీలన


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి విమలారాణి

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్టాపురం రైతు సేవా కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి విమలారాణి, ఏఓ అనురాధ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

పురస్కారం



చీపురుపల్లి: మండలంలోని గొల్లలములగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న గంప శ్రీదేవి తెలుగు తేజం పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాషా సేవా పురస్కారాల్లో భాగంగా ఎంపికైన ఈమె ఆగస్టు 31న పల్నాడు జిల్లాలోని నరసారావుపేటలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆమెకు ఆహ్వానం పంపారు.

చంద్రబాబుకు దివ్యాంగుల ఉసురు తగులుతుంది

● వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జైహింద్‌కుమార్


కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: అర్హత ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను నిలిపేస్తోందని.. వారి ఉసురు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తప్పకుండా తగులుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని వసాదిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆడబిడ్డ నిధి ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయని నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, సర్పంచ్ బండారు సూర్యారావు, ఎంపీటీసీ సభ్యురాలు అలివేలు మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల పనుల ప్రారంభం


ఎస్.కోట ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న డ్రెయిన్

శృంగవరపుకోట: ఎస్.కోటలోని ప్రధాన రహదారిలో మురుగునీటి సమస్య నిర్మూలనకు ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. రహదారిలో నెలకొన్న ఆక్రమణలను తొలగించి డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.90 లక్షల నిధులతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారిలో ఒకవైపు డ్రెయిన్ల పనులు చేపడుతున్నారు. పనులు త్వరగా పూర్తిగా చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం...


చీపురుపల్లి: మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు గోవిందరాజులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని వక్తలు, పర్యావరణ ప్రేమికులు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పీఓపీ విగ్రహాల వల్ల వాయు, జలకాలుష్యం జరుగుతుందని, దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున సంప్రదాయ ప్రకారం మట్టి విగ్రహాలనే పూజించాలని పలువురు తెలిపారు. ఈ మేరకు పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యవరణ ప్రేమికులు సోమవారం మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. వినాయక మంటపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

– చీపురుపల్లి/వేపాడ/శృంగవరపుకోట/జామి/గజపతినగరం రూరల్


వేపాడ: బొద్దాంలో మట్టి వినాయకుల్ని పంపిణీ చేస్తున్న జియో, పీడబ్ల్యూజే సంస్థల ప్రతినిధులు


శృంగవరపుకోట: పట్టణంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న 'స్నేహ' సభ్యులు


జామి: మండల కేంద్రంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సిమ్ డైరెక్టర్ విజయలక్ష్మి, బి.రామకృష్ణ


గజపతినగరం రూరల్: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎస్సై, తదితరులు


చీపురుపల్లి: వినాయక విగ్రహాలకు పూజలు చేసి పంపిణీ చేస్తున్న దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ

కూటమి నాయకుల్లో పదవుల చిచ్చు

● నామినేటెడ్ పదవుల్లో బీజేపీ, టీడీపీ సీనియర్లకు దక్కని చోటు
● జనసేనకు ఒక్కపదవితో సరిపెట్టిన వైనం
● సీనియర్లను కాదని కొత్తగా పార్టీలో చేరిన వారికి పోస్టులు
● బహిరంగంగా విమర్శిస్తున్న సీనియర్లు

మెరకముడిదాం: మండలంలోని కూటమి నాయకుల్లో పదవుల చిచ్చు రేగింది. ఏడాదిన్నర కిందట జరిగిన ఎన్నికల్లో ఓట్ల కోసం కలసిమెలిసి తిరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు ఒకరిపై ఒకరు కారాలు, మిరియాలు నూరుకొనే పరిస్థితిలో ఉన్నారు. దీనికి ఉదాహరణగా ఇటీవల కేటాయించిన నామినేటెడ్ పదవులు అనే చెప్పుకోవాలి. ఎందుకంటే మండలంలో ఉన్న నాలుగు పీఏసీఎస్‌ల చైర్మన్ పదవులు తెలుగుదేశం పార్టీకి చెందిన వారికే కేటాయించారు. అలాగే రెండు మండలాలకు చెందిన మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవిని కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడికే కట్టబెట్టారు. అయితే ఇందులో చినబంటుపల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల్లో ఒక పదవిని మాత్రం జనసేనకు కేటాయించారు. అయితే బీజేపీ నాయకులకు ఒక్క పదవి కూడా వరించకపోవడంపై నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకొని ఉన్న తమను కాదని.. నిన్న మొన్న పార్టీలోకి వచ్చినవారికి పదవులు కట్టబెట్టడంపై మండిపడుతున్నారు. కావాలనే తమను అణగదొక్కుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే విధానం కొనసాగిస్తే తమ నిర్ణయం తాము తీసుకోవాల్సి వస్తుందని కొందరు తెలుగు తమ్ముళ్లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

కొత్త ఫీడర్ ప్రారంభం

శృంగవరపుకోట: పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పుణ్యగిరి మార్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన 11 కేవీ ఫీడర్‌ను ఈఈ సురేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇకపై నాణ్యమైన విద్యుత్ వినియోగదారులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ బి.వెంకటరావు, ఏఈ కె.అప్పారావు, డీఈ త్రినాథరావు, ఏఈ కె.గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటి వద్ద రేషన్‌కార్డుల పంపిణీ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఏ ప్రభుత్వ పథకమైనా సరే కొత్తగా మంజూరైతే స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పంచాయతీ కార్యాలయం, సచివాలయం లేదా ప్రభుత్వ కార్యాలయంలో ప్రారంభించాలి. అయితే నేటి రాజకీయాల్లో ఆ పరిస్థితులు మారిపోయి ప్రజాప్రతినిధుల ఇంటి వద్దకే అధికారులను పిలిపించి మరీ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలాంటి విధానాలపై స్థానిక ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గరివిడి మండలంలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను కూడా టీడీపీ నాయకులు ఇదే తరహాలో పంపిణీ చేశారు. గరివిడి మండలంలోని రేగటి, కోనూరు పంచాయతీలకు మంజూరైన రేషన్‌కార్డులను టీడీపీ నాయకులు తమ ఇళ్ల వద్ద సోమవారం పంపిణీ చేశారు. కనీసం ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులకు సైతం తెలియజేయకపోవడం విశేషం.

దుకాణాల ఏర్పాటును నిలువరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హైస్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట:

పట్టణంలోని ఎస్.కోట ప్రధాన రహదారిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైపు దుకాణాల ఏర్పాటును నిలువరించాలని ఎస్ఎంసీ సభ్యులు, పట్టణ పెద్దలు కోరారు. సోమవారం నిర్వహించిన ఎస్ఎంసీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం తహసీల్దార్ డి. శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పాఠశాల ప్రహరీని ఆనుకుని దేశభక్తుల విగ్రహాలు, చిత్రపటాల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ జె.నాగేశ్వరరావు, హెచ్ఎం జగదీశ్వరరావు, వేదిక అధ్యక్షుడు సూర్యారావు, వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పీఎం ఆచారి, మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు వై.వెంకటరావు, ఐ.శైలజ, పి.రంగారావు, మహ్మద్ షమీర్, న్యాయవాది బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్


సబ్‌జైల్‌లో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

చీపురుపల్లి: ఎంతో ఉజ్వల భవిష్యత్ అనుభవించాల్సిన బాలికలకు 18 ఏళ్లలోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాలతో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వివాహాలు చేస్తే శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ధర్మరాజు, సీఐ జి.శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ..

అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడున్న ఖైదీలతో మాట్లాడుతూ.. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే సబ్‌జైల్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్స్‌ను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ ఆలోచనలు ప్రజలకు చేరాలి


బ్రోచర్ విడుదల చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

శృంగవరపుకోట: భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించిన డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ప్రజలకు చేరాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రచురించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన తన కార్యాలయంలో విజ్ఞాన కేంద్రం సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత సంఘ ప్రతినిధులు డోల కేశవ, గుర్రపు శ్రీను, తెరపల్లి కోటరావు, బోనెల ఈశ్వరరావు, తెరపల్లి సూరిబాబు, మెయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు


రైతుసేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

గుర్ల: యూరియా దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని పాలవలస రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని తెలియడంతో మండలంలోని రైతులందరూ ఒక్కసారిగా చేరుకున్నారు. దీంతో ఆర్ఎస్‌కే వద్ద గందరగోళం నెలకొంది. పాలవలస రైతులకు మాత్రమే యూరియా అందిస్తామని చెప్పడంతో ఇతర గ్రామాలకు చెందిన రైతులు ఉసూరోమంటూ వెనుదిరిగారు.

ఆత్మరక్షణ విద్య అవసరం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పోలీసు సిబ్బంది

గుర్ల: విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య అవసరమని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఆత్మరక్షణ విద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఈ విద్య ఎంతో అవసరం అవుతుందని చెప్పారు. శిక్షణలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పొందాలి..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం కరాటే, తైక్వాండో వంటి విద్యలో శిక్షణ పొందాలని గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.